సాక్షి
అనకాపల్లి
గురువారం । 26 । డిసెంబర్ । 2024



శేష వాహనంపై సప్త గిరీశుడు

నక్కపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో బుధవారం ఇత్తడి శేషవాహనం పై వేంకటేశ్వర స్వామి తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామి వారి మూల విరాట్‌కు నిత్య పూజలు, అభిషేకలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన ఉత్సవ మూర్తులకు గోదాదేవి అమ్మవారి సన్నిధిలో నిత్యార్చనలు నిర్వహించారు. ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని శేష వాహనం పైన, పల్లకీ పై గోదాదేవి అమ్మవారిని ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు.



కశింకోట గవరపేటలోని ప్రార్థనా మందిరంలో క్రీస్తు బోధనలు వినిపిస్తున్న పాస్టర్ మూర్తి



మాకవరపాలెం మండలం కొండలగ్రహారం ఇమ్మానుయేలు చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



యలమంచిలి ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కరుణ కురిసిన వేళ..

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- కిటకిటలాడిన చర్చిలు
- ప్రార్థనల్లో తరించిన విశ్వాసులు



కరుణామయుడైన ఏసు క్రీస్తు బాల యేసుగా భూమిపై అవతరించిన వేళ.. విశ్వాసుల హృదయాలు భక్తిభావంతో నిండిపోయాయి. నక్షత్రాలు కాంతులీనాయి. క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులందరూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యుత్ దీపాల అలంకరణతో చర్చిలన్నీ శోభిల్లాయి. క్రిస్మస్ సందర్భంగా భక్తులందరూ బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చర్చిలకే పరిమితమయ్యారు. నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కిక్కిరిసిన క్రైస్తవ భక్తులతో ఆయా చర్చిల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. బిషప్‌లు, పాస్టర్లు, దైవ సందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు.

-సాక్షి నెట్‌వర్క్





చర్చిలో కొవ్వొత్తులు వెలగిస్తున్న బాలలు



బహుమతులు పంచుతున్న శాంతాక్లాజ్ వేషధారి



కశింకోటలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

న్యూస్‌రీల్

ఎస్‌టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్‌కు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో రూ.19.17 కోట్లతో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్‌కు బుధవారం భూమి పూజ నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023 జూలైలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు ఏయూతో ఎస్‌టీపీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. 15 నెలల్లో 30 వేల చదరపు అడుగుల సామర్థ్యంతో ఇంక్యుబేషన్ సెంటర్ అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో ఎస్‌టీపీఐ విశాఖ ప్రతినిధి జార్జ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా క్రిస్మస్ వేడుకలు : ఎస్పీ

అనకాపల్లి: జిల్లాలో ప్రధాన చర్చిల వద్ద బుధవారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో క్రిస్మస్ వేడుకలు ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. చర్చిల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. జనవరి 1వ తేదీన ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించాలని ఆయన కోరారు.

కడప యువ సమ్మేళనానికి మై భారత్ వలంటీర్లు



యువ సమ్మేళనంలో పాల్గొనే వలంటీర్లు

ఏయూక్యాంపస్: అంతర జిల్లా యువ సమ్మేళనంలో పాల్గొనడానికి విశాఖ జిల్లాకు చెందిన నెహ్రూ యువ కేంద్రం(మై భారత్) వలంటీర్లు బుధవారం కడప బయలు దేరి వెళ్లారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు జరిగే యువ సమ్మేళనంలో వలంటీర్లు భాగమవుతారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన 25 మంది యువతీ యువకులు దీనిలో పాల్గొన్నారు. విభిన్న ప్రాంతాల ప్రజలు జీవనం, అలవాట్లు, సంస్కృతులు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. భారత యువజన మంత్రిత్వ శాఖ, ఎన్‌వైకే సమన్వయంతో 90 యువ సమ్మేళనాలను దేశ వ్యాప్తంగానిర్వహిస్తున్నారు. విశాఖ నుంచి వెళ్తున్న ఈ బృందం ప్రయాణాన్ని ఎన్‌వైకే ఉమ్మడి విశాఖ జిల్లా యువజన అధికారి గొర్లె మహేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు.

వ్యాపారాలకు విఘాతం



ముఠా కార్మికులతో సంఘం నాయకుడు భీశెట్టి అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్

- అనకాపల్లిలో కూలి రేట్ల పెంపుపై కుదరని ఏకాభిప్రాయం
- సమ్మె నోటీసు ఇచ్చిన కూలీలు
- బంద్ ప్రకటించిన వ్యాపారులు
- నేటి నుంచి స్తంభించనున్న మార్కెట్

అనకాపల్లి: కూలి రేట్ల పెంపు విషయంలో అంగీకారం కుదరకపోవడంతో అనకాపల్లి పట్టణంలో వ్యాపారులు, ముఠా వర్కర్లు గురువారం నుంచి పోటాపోటీగా బంద్, సమ్మె నిర్వహించనున్నారు. ఈ మేరకు రెండు వర్గాల వారు నిర్ణయించారు. వర్కర్లు సమ్మె నోటీసులు ఇవ్వగా, బంద్ పాటించాలని వ్యాపారులు నిర్ణయించారు. వివరాలు.. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ముఠా కార్మికుల కూలిరేట్లు పెంచాలని గత 20 రోజుల్లో మూడు సార్లు బియ్యం, కిరాణా, ఆయిల్ వ్యాపారులకు సమ్మె నోటీలు ఇచ్చారు. దీనిపై మూడు సార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి.

వ్యాపారులదే బాధ్యత

ముఠా కార్మికుల కూలిరేట్ల పెంపుపై ప్రభుత్వం, వ్యాపారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ముఠా కార్మికుల సంఘం(సీఐటీయూ) నాయకుడు భీశెట్టి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డు మార్కెట్‌యార్డు సమీపంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలి రెట్లు పెంచాలని 20 రోజుల్లో వ్యాపారులకు మూడు సార్లు సమ్మెనోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేక పోవడంతో ఈనెల 26 నుంచి సమ్మె చేయనున్నట్టు చెప్పారు. సమ్మెకు పూర్తి బాధ్యత వ్యాపారులదేనన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సభ్యులు తిర్రి సురేష్, కాపుశెట్టి అప్పారావు, నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దేడ శంకరరావు

50 శాతం పెంచలేం

ముఠా కార్మికులు డిమాండ్ చేస్తున్నట్టుగా ప్రస్తుతమున్న కూలి రేట్లకు అదనంగా 50 శాతం పెంచలేమని అనకాపల్లి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దేడ శంకరరావు తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం రైస్, కిరాణా, ఆయిల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీంతో గురువారం నుంచి షాపులు మూసివేసి బంద్ పాటించనున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుత కూలిరేట్లకు అదనంగా 50శాతం పెంచితేనే పనిచేస్తామని, లేకపోతే ఈ నెల 26 నుంచి సమ్మెచేస్తామని వర్కర్లు నోటీస్ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం వ్యాపారులు 50 కిలోల బస్తాకు రూ.9.64, 26 కిలోల బస్తాకు రూ.8.06, ఆయిల్ డబ్బాకు రూ.5.18 చొప్పున కూలి చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఇతర ప్రాంతాల వ్యాపారుల కంటే అధికంగా చెల్లిస్తున్నట్టు ఆయన తెలిపారు. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ రావడంతో వ్యాపారాలు సరిగా లేవని, 50శాతం పెంచినట్టయితే వ్యాపారులపై మరింత భారం పడుతుందన్నారు.

స్పీకర్ శంకుస్థాపన చేసిన రోడ్లు...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనివే

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ఇటీవల శంకుస్థాపన చేసిన రోడ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనివేనని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో నాతవరం మండలం సుందరకోట నుంచి అసనగిరి వరకు 3.2 కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల 5 లక్షలు, మాకవరపాలెం మండలం గిడుతూరు నుంచి కోటవురట్ల మండలం సుంకపూరు వరకు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆ ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు అప్పట్లో జగనన్న దృష్టికి తీసుకువెళ్లి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కింద నాబార్డు నుంచి నిధులు మంజూరు చేశామన్నారు. 2023 అక్టోబర్ 10న మంజూరు కాగా, 2024 జనవరి 29న టెండర్లు పిలవటం జరిగిందన్నారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతోనో లేక మరే ఇతర కారణాల వల్లనో అప్పట్లో పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం అవే పనులకు రెండు రోజుల క్రితం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారన్నారు. మాకవరపాలెం మండలం గిడుతూరు నుంచి కోటవురట్ల మండలం సుంకపూరు వరకు మంజూరు చేసిన రోడ్డు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల సరిహద్దులను కలుపుతుందన్నారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడం శుభపరిణామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

గోవాడ సుగర్స్‌లో లాంఛనంగా క్రషింగ్ ప్రారంభం

- వారంలో రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్‌కు చర్యలు
- ఈ ఏడాది 1.5 లక్షల టన్నులు లక్ష్యం
- 9.5 శాతం రికవరీ వస్తే టన్ను చెరకుకు రూ.3,151 మద్దతు ధర:ఎండీ వెల్లడి



గోవాడ సుగర్స్‌లో కేన్ క్యారియర్ వద్ద పూజలు చేసి, చెరకు గడలు వేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న ఎండీ సన్యాసినాయుడు, సిబ్బంది

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. ఫ్యాక్టరీ కేన్ క్యారియర్ వద్ద మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు, అధికారులు, కార్మికులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కేన్ క్యారియర్‌లో చెరకు గడల కట్టలు వేసి క్యారియర్‌ను ఆన్ చేసి ఈ సీజన్‌కు సంబంధించిన క్రషింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ సన్యాసినాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని సమస్యలు అధిగమించి అనుకున్న లక్ష్యం మేరకు క్రషింగ్ చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. వారంరోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ చేపడతామని చెప్పారు. ఈ ఏడాది 9.5శాతం రికవరీ వస్తే టన్నుకి రూ. 3,151 చొప్పున చెల్లించనున్నట్టు ఆయన చెప్పారు. ఈ సీజన్‌లో సుమారు 1.5 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న మొత్తం చెరకును తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికి 13వేల మంది రైతుల నుంచి 1.50 లక్షల టన్నుల చెరకు సేకరించేందుకు అగ్రిమెంట్లు పొందినట్టు చెప్పారు. కటింగ్ పర్మిట్లు ఇచ్చిన 48గంటల్లోగా ఫ్యాక్టరీకి సరఫరా చేయాలని రైతులను ఎండీ కోరారు. రస నాణ్యతను బట్టి కటింగ్ ఆర్డర్లు ఇస్తామన్నారు. ఒకే చోట రైతులు గ్రూపుగా ఉండి చెరకు వేస్తే వారందరికీ ఒకే సారి కటింగ్ పర్మిట్లు ఇచ్చే విధానాన్ని కూడా అమలులోకి తెచ్చినట్టు తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రైతులకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఒంటి కన్ను ముచ్చు విత్తనం ఇవ్వడంతోపాటు మంచి రికవరీ వచ్చే విత్తనాలను ఈ ఏడాది రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గత సీజన్‌కు సంబంధించి టన్నుకి రూ.350 చొప్పున రైతులకు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు త్వరలో చెల్లిస్తామని ఎండీ చెప్పారు. ఈ ఏడాది సరఫరా చేసే చెరకుకు సకాలంలోనే డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైతులంతా చెరకు సరఫరా చేసి ఫ్యాక్టరీ మనుగడను కాపాడాలని, ప్రైవేటు ఫ్యాక్టరీలకు ఎవరూ సరఫరా చేయవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కర రావు, కార్మిక సంఘం నాయకుడు శరగడం రాము నాయుడు పాల్గొన్నారు.

అక్రమాల 'సేన'

భూ దాహం

- సర్కారు భూములపై కన్ను
- మూడు నెలల్లో మూడంతస్తుల భవనాలు
- కూటమి ప్రభుత్వంలో జోరందుకున్న అక్రమ నిర్మాణాలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తుమ్మపాల:

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు వాలిపోతున్నారు. గెడ్డలు, చెరువులను సైతం ఆక్రమిస్తున్నారు. అలా చూస్తుండగానే భారీ భవంతులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ సిబ్బంది సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఎందుకంటే వారు కూటమి నేతలు. జనసేన, టీడీపీ, బీజేపీలు కలగలిసిన కూటమి ప్రభుత్వ పాలనలో అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ముఖ్యంగా అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో జనసేన నాయకుల దందా జోరుగా సాగుతోంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆవురావురుమంటూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని శరవేగంగా భవన నిర్మాణాలు పూర్తి చేస్తుండడంతో గ్రామస్తులు నివ్వెరపోతున్నారు. మండలంలో మారేడుపూడి, గొలగాం, గోపాలపురం గ్రామాల్లో జనసేన నాయకులు భారీగానే భవంతులు కట్టేస్తున్నారు. బందలు, గెడ్డల ఆక్రమణ మరీ దారుణంగా ఉంది. రాత్రికి రాత్రే చదును చేస్తున్నారు. తెల్లరేసరికి భవన నిర్మాణ సామగ్రి ప్రత్యక్షమైపోతుంది. శరవేగంగా నిర్మాణం పూర్తవుతోంది.



మారేడుపూడి చెరువును ఆక్రమించి నిర్మిస్తున్న భవనాలు



అనకాపల్లిలో గిరాకీని ఆసరాగా చేసుకొని..

అనకాపల్లి మండలం ప్రశాంతతకు మారుపేరు. జిల్లా కేంద్రం అయినప్పటికీ చక్కని వాతావరణంతో అందరికీ అందుబాటులో ఉంటుంది. దీంతో పట్టణంతోపాటు గ్రామీణ మండలంలో నివాస గృహాలకు గిరాకీ పెరిగింది. స్థలాల కొనుగోలు కన్నా నిర్మాణాలు పూర్తయి, నివాసయోగ్యంగా ఉన్న భవనాల కొనుగోలుకు అందరూ మొగ్గు చూపుతున్నారు. దీంతో గ్రామాల్లో ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు జనసేన నాయకులు వాలిపోతున్నారు. ముఖ్యంగా గోపాలపురం గ్రామాన్ని ఆనుకొని ఉన్న మారేడుపూడి సర్వే నంబర్: 133, 134, 135, 137లలో ప్రభుత్వ భూములు, గెడ్డలు, బందలు పూర్తిగా ఆక్రమించి అపార్టుమెంట్లు తలపించేలా భవనాలు నిర్మిస్తున్నారు. ఇక్కడకు సమీపంలోనే కలెక్టర్ బంగ్లా, ఏపీఐఐసీ స్థలాల్లో ఆటోనగర్ నిర్మాణం జరుగుతుండడంతో ఈ గ్రామాల్లో భూములు ఎక్కువగా ఆక్రమణలకు గురవుతున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో మారేడుపూడి అయినప్పటికీ గోపాలపురం గ్రామానికి ఆనుకుని ఉన్న గోపాలపురం కాలనీ వద్ద బందలు, గెడ్డ భూముల్లో భారీ భవనాలు మూడంతస్తుల మేర పూర్తి చేసేశారు. ఒక్కో భవనం కనీసం 10 సెంట్ల విస్తీర్ణం కలిగి అపార్ట్‌మెంట్లను తలపిస్తున్నాయి. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేరు చెప్పి మండలంలోని కూండ్రం గ్రామంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న మహిళ గొలగాం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు కేటాయించిన సర్వే నం:283 ప్రభుత్వభూమిలో 50 సెంట్ల స్థలాన్ని ఇటీవల చదును చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



గోపాలపురంలో నిర్మిస్తున్న భవనం



మారేడుపూడి బందలో 10 సెంట్లలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

నిర్లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు

గ్రామాల్లో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రథమ కర్తవ్యం ఆ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులదే. ప్రభుత్వ భూములతోపాటు నీటిపారుదల జరిగే వాగులు, గెడ్డలు, చెరువులపై ప్రత్యేక చొరవ చూపాల్సిన బాధ్యత కూడా వీరికుంది. కానీ క్షేత్రస్థాయిలో వీఆర్వోలు పూర్తి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారనడానికి అక్రమ నిర్మాణాలే నిదర్శనంగా ఉంది. జనసేన, టీడీపీ, బీజేపీ ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే గ్రామాల్లో ప్రభుత్వ భూములన్నీ దాదాపు ఆక్రమణలకు గురయ్యాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే జనసేన పార్టీకి చెందిన వారు కావడంతో ఆక్రమణల్లో జనసేన నాయకులు టీడీపీ, బీజేపీల నాయకుల కన్నా ముందంజలోనే ఉన్నారు. మండలంలో ఎక్కడ చూసిన జనసేన నాయకులే ఆక్రమణలు చేపడుతున్నారు. వీఆర్వోలు వీరికి తొత్తులుగా మారిపోయారు. గ్రామాల్లో బందలు, గెడ్డల్లో ఆక్రమణలపై కన్నెత్తి కూడా చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

సెల్ మోగదు రంగా..!

- విశాఖలో పెరుగుతున్న కాల్ వాల్యూమ్
- మొబైల్ కాల్స్ కలవక యూజర్ల ఇక్కట్లు
- సెల్ టవర్ సామర్థ్యానికి మించి నెట్‌వర్క్ కనెక్షన్లు
- సిగ్నల్ సామర్థ్యం పెంచని నెట్‌వర్క్ కంపెనీలు
- 4జీ టవర్స్‌లోనే 5జీ వినియోగంతో మొదలైన కష్టాలు

మొబైల్ నుంచి ఎవరికైనా కాల్ చేస్తే చాలు.. బీప్.. బీప్.. కీక్.. కీక్.. కుయ్.. కుయ్.. అంటూ వింత శబ్దాలు.. ఆ తర్వాత కాల్ కనెక్ట్ అవ్వొచ్చు, కాకపోవచ్చు కూడా! కొన్నిసార్లు కాల్ చేస్తుంటే.. నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో చెప్పలేం. ఆ కాల్ కనెక్ట్ అవుతుందా? కాదా? లేదా మన ఫోన్ పాడైపోయిందా? అనే ఆందోళన మనందరిలో మొదలవుతుంది. ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ దాదాపు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు కదా? కొందరైతే తమ ఫోన్ పనిచేయడం లేదని కలవరపడుతూ రిపేర్ షాపులకు వెళ్తున్నారు. ఇంకొందరు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఆన్ చేస్తున్నారు.. మరికొందరైతే ఒక మెట్టు పైకెక్కి.. ఏకంగా ఫోన్నే మార్చేస్తున్నారు. అయినా సమస్య మళ్లీ మొదటికొస్తోంది కదా.. దీనికి కారణం మీ ఫోన్ కాదండోయ్.. మీరు వాడుతున్న నెట్‌వర్క్‌ది. కాల్స్ సంఖ్య పెరుగుతున్న తరుణంలో.. ఏర్పడిన వైపరీత్యమే ఈ సమస్యకు ప్రధాన కారణం. ఒక్క కాల్ ఇన్ని సమస్యలు ఎందుకు తెచ్చిపెట్టిందో తెలుసా?

– సాక్షి, విశాఖపట్నం

దూరమెంత ఉన్నా, దగ్గర చేసే సాధనంగా మారిన సెల్‌ఫోన్ ఉంటే.. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మాట్లాడుకునే వెసులుబాటు వచ్చేసింది. అందుకే నగర ప్రజలు ఫోన్‌తో కుస్తీ పడుతున్నారు. ఒక కాల్ చేసుకోవాలంటే దాదాపు 2 నుంచి 3 నిమిషాల సమయం వృథా చేయాల్సి వస్తోంది. జనాభా పెరగడం, మొబైల్ వినియోగదారులు కూడా పెరుగుతున్నారు. నెట్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. బిజీ బిజీగా జీవితాలు ఎలా మారిపోయాయో, మొబైల్ నెట్‌వర్క్‌లు కూడా అంతే బిజీ అయిపోయాయి. ఎవరికి కాల్ చేసినా పెద్ద శబ్దంతో బీప్ సౌండ్ 3 నుంచి 5 సెకన్ల పాటు వినిపిస్తోంది. ఆ తర్వాత అదృష్టం ఉంటే కాల్ కనెక్ట్ అవుతోంది, లేకపోతే డిస్‌కనెక్ట్ అవుతోంది. ఈ సమస్యతో నగరంలో దాదాపు 90 శాతం మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది సిగ్నల్స్ కోసం మేడల మీదికి, రోడ్ల మీదికి వచ్చి మరీ కాల్స్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. చాలామంది ఫోన్‌ను పదే పదే స్విచ్ ఆఫ్, రీస్టార్ట్ చేస్తూ ఈసారైనా కాల్ కలుస్తుందో లేదో అని తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కొన్నిసార్లు వింత శబ్దాలు రావడంతో ఫోన్ పేలిపోతుందేమోనని భయపడుతున్నారు. ఎవరికి కాల్ చేసినా ఇదే సమస్య పునరావృతం కావడంతో సెల్‌ఫోన్ రిపేర్ షాపులకు పరుగులు తీస్తున్నారు. గత కొద్ది రోజులుగా నగరంలో మొబైల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇవి. అయితే ఈ సమస్య వెనుక అసలు కారణం మరొకటి ఉందని టెలికాం సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.





పెరిగిన కాల్స్ వినియోగం

జనసాంద్రత పెరుగుతున్న కారణంగా, ఒక్కో టవర్ పరిధిలో కాల్స్ వినియోగం కొద్ది నెలలుగా గణనీయంగా పెరిగింది. ఇదే దీనికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. సాధారణంగా ఒక కాల్ కనెక్ట్ అవ్వడానికి కొన్ని క్షణాల వ్యవధి పడుతుంది. ఈ సమయాన్ని కేటాయించడంలో ఆలస్యం జరిగితే కాల్ కనెక్ట్ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. వినియోగదారుడు వాడే మొబైల్ మోడల్‌ను బట్టి 2జీ, 3జీ, 4జీ, 5జీ మోడ్‌లలో కాల్స్ చేస్తుంటారు. 2జీ కాల్స్ స్విచ్చింగ్ ద్వారా కనెక్ట్ అవుతాయి. 3జీ, 4జీ, 5జీ మోడ్‌లలో ఐపీ ద్వారా కాల్స్ కనెక్ట్ అవుతాయి. ప్రతి కాల్ కనెక్ట్ అవ్వడానికి టైం స్లాట్, ఫ్రీక్వెన్సీ స్లాట్ ఉంటాయి. ఈ రెండు స్లాట్లు సెకన్ల వ్యవధిలో అనుమతి పొందేలా ఉంటాయి. అప్పుడే కాల్ అవతలి వ్యక్తికి చేరి మాట్లాడగలిగే అవకాశం ఉంటుంది. లేకపోతే ప్రస్తుతం వినిపిస్తున్నట్లుగా బీప్ సౌండ్ వస్తుంది అని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఒక సెల్ టవర్ నిమిషానికి 1000 నుంచి 1500 కాల్స్ వరకు నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ పరిమితిలో కాల్స్ వెళ్లేటప్పుడు టైం స్లాట్ వెంటనే యాక్టివేట్ అయ్యి ఫోన్ కాల్ అవతలి వ్యక్తికి చేరుకుని మాట్లాడే అవకాశం ఉంటుంది. ఇటీవల కాల్స్ మాట్లాడే సమయం కూడా పెరిగింది. 2010లో ఒక కాల్ మాట్లాడే సగటు సమయం 2 నిమిషాలు ఉండగా.. ప్రస్తుతం ఈ సమయం 7 నిమిషాలకు చేరుకుంది. ఫలితంగా ఒక్కో సెల్ టవర్ పరిధిలో సామర్థ్యానికి మించి కాల్స్ వెళ్లడం వల్ల ఈ అసౌకర్యం కలుగుతోందని టెలికాం రంగ నిపుణులు చెబుతున్నారు. కాల్స్ రద్దీ తగ్గితే ఈ సమస్య ఉండదని వారు స్పష్టం చేస్తున్నారు.

టవర్‌కు మించిన సామర్థ్యంతో..

ఒక్కో సెల్ టవర్‌కు 2 నుంచి 3 వేల మొబైల్స్ సామర్థ్యం ఉంటుంది. ఒక్కో ఆపరేటర్‌కు 300 నుంచి 400 వరకు సెల్ సైట్లు ఉంటాయి. అయితే, ఇటీవల కాలంలో నెట్‌వర్క్ కంపెనీలు ఆఫర్లు ఇచ్చి సిమ్ కార్డుల కొనుగోళ్లు పెంచుకుంటున్నాయి. కానీ, దానికి అనుగుణంగా నెట్‌వర్క్ సామర్థ్యంను మాత్రం పెంచడం లేదు. ఉదాహరణకు మధురవాడలో ఒక సెల్ టవర్‌ను 2020లో ఏర్పాటు చేశారు. అప్పట్లో దాని పరిధిలో 3 వేల సిమ్ కార్డులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం అదే సెల్ టవర్ పరిధిలో ఇప్పుడు 5 వేలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. దీంతో ఒక టవర్ నుంచి వచ్చే సిగ్నల్ ఫ్రీక్వెన్సీని 5 వేల సిమ్ కార్డులకు సమాంతరంగా అందించాల్సి వస్తుంది. ఫలితంగా సిగ్నల్ క్వాలిటీ తగ్గిపోయింది. దీంతో ఆ పరిధిలో ఉన్న వారంతా కాల్ కనెక్ట్ అవ్వక ఇబ్బందులు పడుతున్నారు. నగర పరిధిలో దాదాపు అన్ని చోట్లా ఇదే తంతు జరుగుతోంది. తమ వినియోగదారుల సంఖ్యను పెంచుకునేందుకు ఇంటర్నెట్, కాల్స్, వ్యాలిడిటీపై ఆఫర్లు గుప్పిస్తున్న నెట్‌వర్క్ కంపెనీలు సేవలపై మాత్రం శ్రద్ధ చూపించడం లేదు. కొన్ని నెట్‌వర్క్ కంపెనీలు తమ 4జీ టవర్స్‌ను 5జీ టవర్స్‌గా అప్‌గ్రేడ్ చేశాయి. టవర్ పరిధిలోని 5జీ వినియోగదారులు ఎక్కువ ఫ్రీక్వెన్సీని వినియోగిస్తుండటంతో 4జీ వినియోగదారులకు సిగ్నల్ సమస్యలు ఎక్కువయ్యాయి.

కరెంటు ఛార్జీల పెంపుపై 27న ఆందోళన

- ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



చోడవరంలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, తదితరులు

చోడవరం: కరెంటు ఛార్జీల పెంపుపై ఈనెల 27వ తేదీన ప్రజల పక్షాల వైఎస్సార్‌సీపీ ఆందోళన చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపు ఇచ్చారు. ఈ ఆందోళనకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్లను చోడవరం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని చెప్పి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెల్లోనే నాలుగు సార్లు వివిధ రూపాల్లో కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాన్ని మోపిందని ధ్వజమెత్తారు. ప్రజలపై భారాన్ని మోపిన కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. దీనిలో భాగంగా కరెంటు ఛార్జీల బాదుడును నిరసిస్తూ ఈనెల 27వతేదీన శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో ఆందోళన చేస్తున్నామన్నారు. ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి చోడవరం విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టడించి, అక్కడ ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ ఆందోళనలో పెద్దసంఖ్యలో ప్రజలు,వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిదులు అంతా పాల్గొనాలని ధర్మశ్రీ పిలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంపలి ఆనందీశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, శరగడం చిమ్మినాయుడు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక రేపు

మధురవాడ(విశాఖ): మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్పీ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. హౌజత్ స్పోర్ట్స్ క్లబ్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి అండర్–17 బాలబాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఇందుకు 2008 జనవరి 1 నుంచి 2024 డిసెంబర్ 27 మధ్య జన్మించిన వారు అర్హులు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్‌మెంట్‌తో సమయానికి హాజరు కావాలని ఆయన సూచించారు. ఎంపికైన జట్లు కాకినాడ ఏడీబీ రోడ్డులోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే 10వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 94900 73414లో సంప్రదించవచ్చు.

మార్టూరు స్కూల్ కమిటీ చైర్మన్‌గా సముద్రాలు

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

తుమ్మపాల: మండలంలోని మార్టూరు హైస్కూల్ కమిటీ ఎన్నికపై హైకోర్టు తీర్పు వెల్లడించింది. చైర్మన్‌గా కోట్ని సముద్రాలు, వైస్ చైర్మన్‌గా ఎస్.కుమారి ఎన్నికను ధ్రువీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలిలా ఉన్నాయి. మార్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ ఏడాది ఆగస్టు 17న తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గ్రామానికి చెందిన కోట్ని సముద్రాలు, చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎస్.కుమారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన హెచ్ఎం విజయ నిబంధనల ప్రకారం ప్రొసీజర్ పూర్తి చేవారు. అయితే అధికార కూటమి నాయకులు వారి ఎన్నికను తట్టుకోలేక హెచ్ఎంపై ఒత్తిడి తీసుకొచ్చి అదే నెల 21న రెండో సారి ఎన్నిక నిర్వహించినట్లు చూపి కూటమికి చెందిన పోల్నాటి మహేశ్వరరావును చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా వి.వి. లక్ష్మిని నియమించారు. ముందుగా ఎన్నికైన కోట్ని సముద్రాలు ఆధారాలతో సహా మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పూర్తి ఆధారాలతో హైకోర్టును ఆశ్రయించగా.. విచారణ పూర్తి అయ్యే వరకు చైర్మన్ పదవిలో మహేశ్వరరావును నియమించవద్దని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు చేసింది. ఇప్పటి వరకు ఆ పాఠశాలలో చైర్మన్ పదవి ఖాళీగానే ఉండిపోయింది. ఎన్నిక పూర్వాపరాలను పరిశీలించిన హైకోర్టు.. చైర్మన్‌గా ఎన్నికైన కోట్ని సముద్రాలు, వైస్ చైర్మన్‌గా ఎస్.కుమారిని నియమించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 23న పాఠశాల హెచ్ఎం.విజయ వారిని పిలిచి ఆయా పదవుల్లో నియమించారు.



కోట్ని సముద్రాలు



ఎస్.కుమారి

వైభవంగా కనకమ్మవారి సారె ఊరేగింపు

కశింకోట : కశింకోటలో బుధవారం రాత్రి కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా స్థానిక గవరపేటలోని కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో భక్తులు తెచ్చిన లడ్డులు, వివిధ రకాల తీపి, కారం పిండి వంటలు, అరటి గెలలు నివేదించారు. అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై నిలిపి కోలాటాలతో సారె ఊరేగింపు ప్రారంభించారు. అక్కడి నుంచి మేదరవీధి, సంతబయల, పూసర్ల వీధి, అగ్రహారం, అమరపల్లి వీధి, ఉప్పునీటి దిబ్బ, ద్వారపురెడ్డి వీధి, సతకంపట్టు, కస్పావీధి రామాలయం, రౌతు వీధి, పెద్ద బజారు, గవరపేట మధ్య వీధి మీదుగా తిరిగి ఆలయం వరకు ఊరేగింపు సాగింది. ఈ సమయంలో అమ్మ వారిని భక్తులు దారి పొడవునా దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. సారె ఊరేగింపుతోపాటు చివరి మార్గశిర గురువారం పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు తరలి రానుండడంతో అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు, మాజీ వార్డు సభ్యురాలు సూరిశెట్టి రేవతి, కార్యక్రమంలో పాల్గొన్నారు.



అమ్మవారికి అర్చకుల పూజలు



కశింకోటలో కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు

పెదబొడ్డేపల్లిలో భారీ చోరీ



బీరువాల్లో వస్తువులను చెల్లా చెదురు చేసిన ఆగంతకులు



బాధితులను విచారిస్తున్న డీఎస్పీ మోహన్, సీఐ రేవతమ్మ

నర్సీపట్నం: స్థానిక పెదబొడ్డేపల్లిలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. హెల్త్ అసిస్టెంట్ బి.జె.వి.ప్రసాద్ ఇంట్లో రూ.8 లక్షల నగదు, సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ప్రసాద్ పెదబొడ్డేపల్లిలో నివాసం ఉంటున్నారు. క్రిస్మస్ కారణంగా తన స్వగ్రామం కాకినాడ జిల్లా తునికి మంగళవారం రాత్రి వెళ్లారు. దీనిని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ప్రధాన తలుపు తాళం విరగొట్టి లోపలికి ప్రవేశించారు. రెండు బీరువాల్లో రూ.8 లక్షల నగదు, సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలను పట్టుకెళ్లిపోయారు. ఆ ఇంట్లో పనిచేసే వ్యక్తి బుధవారం మధ్యాహ్నం వచ్చి చూడగా తలుపు తీసి ఉండటాన్ని గమనించి ప్రసాద్‌కు ఫోన్ చేశారు. వెంటనే ఆయన టౌన్ పోలీసులను సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ మోహన్, సీఐ ఎల్.రేవతమ్మ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పర్వతారోహణ చేస్తూ అందనంత దూరానికి...

- విహారయాత్రలో విషాదం
- కొంకణ్‌లో కూర్మన్నపాలెం వాసి మృతి
- మృతుడు చార్టర్డ్ అకౌంటెంట్



మృతుడు కాండ్రేగుల అనిల్‌కుమార్

అగనంపూడి(విశాఖ): విహారయాత్రకు వెళ్లిన కూర్మన్నపాలేనికి చెందిన యువకుడు మృత్యువాతపడ్డాడు. అతని బంధువులు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం సమీపంలోని శాతవాహనగర్–1కి చెందిన కాండ్రేగుల అనిల్‌కుమార్(31) బెంగళూరులోని ఒక ప్రైవేట్ కంపెనీలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. తోటి మిత్రులతో కలిసి అనిల్ గోవా, కొంకణ్ విహారయాత్రకు వెళ్లాడు. సోమవారం కొంకణ్‌లో పర్వతారోహణ చేస్తుండగా ఛాతీలో నొప్పితో బాధపడుతూ ఊపిరి ఆడక కుప్పకూలిపోయాడు. మిత్రులు, స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం శాతవాహనగర్‌కు తీసుకొచ్చారు. కూర్మన్నపాలెంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అందివచ్చిన కొడుకు అకాల మరణంతో అతని తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

బ్యాంకుకు టోకరా వేసిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార(విశాఖ): బంగారం రుణం పేరిట బ్యాంక్‌ను మోసం చేసిన వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా... అల్లిపురం ప్రాంతానికి చెందిన తమరాన చిరంజీవి (40) సీతంపేట సీఎస్‌బీ బ్యాంకు వెళ్లి అక్కడ అధికారులతో.. తన బంగారం సుజాతనగర్ ఫెడరల్ బ్యాంక్‌లో తాకట్టులో ఉందని, దాన్ని విడిపిస్తే మీ బ్యాంక్‌లో తాకట్టు పెడతానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బ్యాంక్ అధికారులు అతడి ఖాతాలో రూ.14.6 లక్షలు జమచేశారు. బంగారం తీసుకురావడానికి చిరంజీవితో పాటు సీఎస్‌బీ బ్యాంక్ ప్రతినిధి ఫెడరల్ బ్యాంక్‌కు వెళ్లాడు. అతడిని బయట ఉంచి లోపలకు వెళ్లిన చిరంజీవి డబ్బులు విత్‌డ్రా చేసి పరారయ్యాడు. దీంతో బ్యాంక్ అధికారులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో చిరంజీవిని ఇన్‌చార్జి సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర అరెస్ట్ చేశారు.

టైం లేదు.. ట్రైన్ లేట్..

- ఆలస్యంగా రైళ్ల రాకపోకలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

తాటిచెట్లపాలెం(విశాఖ): రైలు ప్రయాణం.. ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. నత్త తన గమ్యాన్ని నిర్దేశిత సమయంలో.. తనకున్న వేగంతో చేరుకుంటుంది. కానీ రైలు ప్రయాణం మాత్రం అగమ్యగోచరంగా మారింది. ఏ రైలు ఎప్పుడు గమ్యస్థానానికి చేరుకుంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ మధ్య కాలంలో రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. గతంలో పాసింజర్ రైళ్లు ఎక్కడ పడితే అక్కడ ఆపేయడంతో గంటల తరబడి, ఒక్కోసారి రోజుల తరబడి ఆలస్యంగా నడిచేవి. మోదీ ప్రభుత్వం వచ్చాక పాసింజర్ రైళ్లు దాదాపుగా కనుమరుగయ్యాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ రైళ్లు వేగంగా గమ్యస్థానానికి చేరుస్తాయని ఆశించిన ప్రయాణికులకు నిరాశ ఎదురవుతోంది. ఇటీవల హైదరాబాద్ నుంచి బయలుదేరిన గోదావరి సూపర్‌ఫాస్ట్ దువ్వాడ వరకు నిర్ణీత సమయానికి చేరుకుంది. కానీ దువ్వాడ నుంచి విశాఖపట్నం(17 కిలోమీటర్ల దూరం) చేరుకోవడానికి రెండున్నర గంటల సమయం పట్టింది. ఇలాగే చాలా రైళ్లు అనకాపల్లి, దువ్వాడ నుంచి విశాఖపట్నం స్టేషన్‌కు చేరుకునేందుకు గంటల కొద్దీ సమయం పడుతోంది. ఎంత సూపర్‌ఫాస్ట్ రైలు అయినా ఈ తిప్పలు తప్పడం లేదు. అటునుంచి వచ్చే రైళ్లు మాత్రమే కాదు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే కాచిగూడ, నాందేడ్, విశాఖ, గోదావరి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు కూడా గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. ఆధునికీకరణ పనుల కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే.. వందే భారత్ రైళ్లు ఎందుకు ఆలస్యం కావడం లేదని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్యకాలంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ రెండు రోజులు ఆలస్యమైంది. ఒకరోజు స్టేషన్‌లో రైలు ఇంజిన్ మార్చే క్రమంలో వైర్లు తెగిపోవడం, మరో రోజు గూడ్స్ రైలులో సమస్య తలెత్తడం వల్ల విశాఖకు ఆలస్యంగా చేరుకున్నట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించడం వల్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. దీని వల్ల ముఖ్యమైన పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పనుల మీద రైలు ప్రయాణాలు చేసే వారు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు రైలు ఆలస్యం వల్ల ప్రయాణికులు ప్లానింగ్ మొత్తం మారిపోతోంది. దీని వల్ల అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. అలాగే కనెక్టింగ్ రైళ్లనూ అందులేకపోవతున్నారు. ఒక రైలు ఆలస్యం అయితే దానిపై ఆధారపడి ఉండే ఇతర రైళ్లు లేదా బస్సులు తప్పిపోతున్నాయని ప్రయాణికులు అంటున్నారు.



హనీ ట్రాప్ కేసులో మరో ముగ్గురి అరెస్ట్

- బడాబాబులే టార్గెట్‌గా వలపు వల విసిరిన జాయ్ జమీమా
- ఇప్పటికే ఆమెతో పాటు మరో ముగ్గురు అరెస్ట్
- తాజాగా కీలక ముఠా సభ్యులు రిమాండ్‌కు తరలింపు
- ఇందులో బీజేపీ యువ నాయకుడు అవినాష్ బెంజమిన్ కూడా..



జాయ్ జమీమాతో బెంజమిన్(ఫైల్)

విశాఖ సిటీ: హనీట్రాప్ కేసులో పోలీసులు వేగం పెంచారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా మరో ముగ్గురు కీలక ముఠా సభ్యులను కటకటాల్లోకి పంపించారు. ఇందులో బీజేపీకి చెందిన యువ నాయకుడు కూడా ఉన్నాడు. బడాబాబులే టార్గెట్‌గా చేసుకుని వలపు వల విసిరి.. అనేక మంది నుంచి రూ.లక్షల్లో డబ్బు దోచుకున్న జాయ్ జమీమాతో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఐదేళ్ల నుంచి సమాజంలో ఉన్నతమైన కుటుంబాలను టార్గెట్ చేసిన ఈ ముఠాలో అటవీశాఖ అధికారి బుచ్చ వేణుభాస్కరరావు, కిశోర్ వేములు ఇప్పటికే విశాఖ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠాలో మరో ముగ్గురు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న కీలక సూత్రధారులు ఫాతిమా ఉస్మాన్ చౌదరి@జోయా, ఆమె భర్త తన్వీర్‌తో పాటు బీజేపీ నాయకుడు అవినాష్ బెంజమిన్‌ను అరెస్ట్ చేశారు.

చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

జాయ్ జమీమాను విచారించిన సమయంలో తనను ఏమీ చేయలేరని, రాజకీయ నాయకుల అండ ఉందని పోలీసులను హెచ్చరించింది. విచారణకు సహకరించలేదు. దీంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఇందులో బీజేపీకి చెందిన యువ నాయకుడు అవినాష్ బెంజమిన్‌తో పాటు దంపతులు ఫాతిమా ఉస్మాన్ చౌదరి@జోయా, తన్వీర్ పాత్ర కూడా ఉన్నట్లు తెలుసుకున్నారు. బాధితుల మీద ఉపయోగించిన మత్తు పదార్థాలు, స్ప్రేల సరఫరాలో వీరు కీలక పాత్ర పోషించినట్లు నిర్ధారణకు వచ్చారు. వారి మధ్య భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు సేకరించారు. వీరి కోసం నిఘా పెట్టగా.. హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. కంచరపాలెం పోలీసులు అక్కడకు వెళ్లి నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. రిమాండ్ బదిలీ ప్రక్రియ ద్వారా వారిని విశాఖకు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించింది.

ఒక్కరి ఫిర్యాదుతో బయటకొచ్చిన బాధితులు

జాయ్ జమీమా అనేక మంది బడాబాబులకు వలపు వల విసిరింది. వారిని బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షలు కాజేసింది. మరికొంత మందితో సహజీవనం చేసి.. వారి భార్యలకు విడాకులు ఇచ్చి తనని పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసేంది. అందుకు అంగీకరించని పక్షంలో హత్యాప్రయత్నం చేసి భారీగా నగదు దోచుకుంది. ఆమె ట్రాప్‌లో చిక్కుకున్న ఒక ఎన్ఆర్ఐ కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు. కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఈ కేసులో జాయ్ జమీమా వెనుక ముఠా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో లభించిన సమాచారంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అటవీ శాఖ అధికారి వేణు భాస్కర్‌రెడ్డిని, మరో సభ్యుడు కిశోర్ వేములను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వీరు ముగ్గురు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. భీమిలి కేసుకు సంబంధించి ఆమెకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా.. మిగిలిన స్టేషన్లలో నమోదైన కేసులపై కూడా ఆమె బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంది.

వీరి చేతిలో మరికొంత మంది మోసపోయినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ముందుకు వస్తే వారికి న్యాయం జరిగేలా చూస్తామని చెబుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధర్మశాస్త్ర కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి పూర్ణ, పుష్కలాంబ సహిత ధర్మశాస్త్ర వారి కల్యాణాన్ని దేవాలయం కోశాధికారి వినకోట నాగకనక పేర్రాజు రాధిక దంపతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు, కార్యదర్శి ఉప్పల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నరసింహావతారంలో వెంకన్న



నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

అనకాపల్లి: ధనుర్మాస వేడుకల్లో భాగంగా స్థానిక గాంధీనగరం ఆలయంలోని వేంకటేశ్వరస్వామి భక్తులకు బుధవారం నరసింహ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి చక్రవర్తి మాట్లాడుతూ స్వామివారు గురు, శుక్రవారాల్లో కూడా నరసింహ అవతారంలో భక్తులకు దర్శనభాగ్యం కలిస్తున్నట్లు చెప్పారు. తెల్లవారు జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

14 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి: అక్రమంగా తరలిస్తున్న 14 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్థానిక వేల్పులవీధి జంక్షన్ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. బుధవారం వాహనాలు తనిఖీ చేసినట్టు ఆయన చెప్పారు. ఆ సమయంలో కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన ఒమ్మి నాగఅప్పారావు నుంచి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 857 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	5,330
మొదటి రకం	3,840	4,500
రెండో రకం	3,310	4,100
మూడోరకం	3,150	3,400

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	సత్యనారాయణ స్క్రీన్-2
ముఫాసా	పర్తిసాయి
బచ్చల మల్లి	షిర్డీసాయి
శ్రీకాకుళం షెర్లాక్ హోమ్	వెంకటేశ్వర
అమరన్	శ్రీసత్య
పుష్ప-2	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-7 యూనిట్లు, బిజిటివ్-4 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 338 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 249 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చును.

ప్రకృతి వ్యవసాయం.. ప్రగతి పథం

అందరూ చిన్న,సన్నకారు రైతులే. విశేష పంథాను ఎన్నుకున్నారు. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర పంటల సాగు చేపట్టారు. వారి కృషి ఫలించడంతో ఇతర ప్రాంతాల రైతులకు ఆదర్శంగా నిలిలిచారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి దిగుబడులు ఈ ఏడాది ఆశాజనంగా ఉండడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా ఉంది.

- కశింకోట మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి సాగు
- ఆశాజనకంగా దిగుబడి
- ఆనందంలో రైతులు



సుందరయ్యపేటలో పంట కోత ప్రయోగంలో సేకరిస్తున్న వరి పనలు

కశింకోట: మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వరి దిగుబడులు ఈ ఏడాది ఆశాజనకంగా ఉన్నాయి. పంట కోత ప్రయోగాల ద్వారా ఈ విషయం వెల్లడైంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు, పండ్ల తోటలు,ఈ ఖరీఫ్‌లో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. తాళ్లపాలెం, జి.భీమవరం, చెరకాం, తీడ, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, ఎల్.కొత్తూరు, అడ్డాం, నూతలగుంటపాలెం తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు తక్కువగా అవుతుండడంతో రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

పంటకోత ప్రయోగాల్లో..

మండలంలోని పలు గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన వరి పంట దిగుబడి ఆశా జనకంగా ఉంది. ఏడు గ్రామాల్లో నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో ఈ విషయం స్పష్టమైంది. సుందరయ్యపేట, ఆనందపురం, చెరకాం, అడ్డాం, జి.భీమవరం, తాళ్లపాలెం, నూతలగుంటపాలెం గ్రామాల్లోని గుర్తించిన పొలాల్లో ఇటీవల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో చతురస్రాకారంలో కోత ప్రయోగాలు జరిపారు. సంబంధిత ప్రాంతంలో కోసిన పనల నుంచి దులిపి ధాన్యాన్ని సేకరించారు. అవి సరాసరి 18 కిలోల వరకు దిగుబడి వచ్చినట్టు సమాచారం. మిగిలిన చేనును కోసి కుప్పలుగా పెట్టారు. వాటిని ఇంకా నూర్చాల్సి ఉంది. నూర్చితే 25 బస్తాలు పైగా దిగుబడి రాగలదని రైతులు పేర్కొంటున్నారు.

తగ్గిన సాగు ఖర్చులు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలసాగు ఖర్చులు తగ్గాయని రైతులు తెలిపారు. సుమారు రెండు ట్రాక్టర్ల ఆవు పేడతో తయారు చేసిన పెంటను సాగుకు ఉపయోగిస్తున్నారు. సహజ సిద్ధంగా తయారు చేసిన ఘన జీవామృతం, ద్రవ, జీవామృతం, వివిధ కషాయాలు, ద్రావణాలను పురుగులు, తెగుళ్లను నివారించడానికి వినియోగిస్తున్నారు. వీటిని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా తక్కువ ధరకు అందిస్తున్నారు. మొత్తం మీద ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు తెలిపారు. ఆరోగ్యకర ధాన్యం దిగుబడి అవుతుండడం వల్ల వాటిని ఇంటి అవసరాలకు సరిపడా వినియోగించి, మిగిలినవి విక్రయించడం ద్వారా ఆదాయం పొందుతున్నట్టు చెప్పారు. ప్రకృతి సిద్ధంగా పండిన ఆరోగ్యకరమైన ఉత్పత్తులు కావడంతో వీటికి మార్కెట్‌లో ఆదరణ ఉందని అన్నదాతలు చెప్పారు.

25 బస్తాలకు పైగా దిగుబడి



ఎకరం భూమిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట వేశాను. ఆశాజనకంగా పండింది. ఇంకా కుప్ప నూర్చాల్సి ఉంది. 25 బస్తాలు పైబడి దిగుబడి రానుంది. ఆరోగ్యకరమైన ధాన్యాన్ని ఇంటి అవసరాలకు వినియోగిస్తాను. మిగిలినవి మార్కెట్‌లో విక్రయిస్తాం. మంచి ఆదాయం సమకూరుతుంది. ఆవు పేడతో తయారుచేసిన ఎరువు, ప్రకృతి వ్యవసాయ ద్రావణాలు, కషాయాలను, జీవామృతాలను వినియోగించి ఏటా పంట పండిస్తున్నాను.పెట్టుబడి తక్కువగా అవుతుంది.

–కచ్చక్ల రాజు, రైతు, లాలంకొత్తూరు.

తక్కువ ఖర్చుతో సాగు



ఈ ఏడాది ఎకరం భూమిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో వరి సాగు చేశాను. బాగా పండింది. పంట కోత ప్రయోగంలో 18 కిలోల వరకు దిగుబడి వచ్చింది. ఇంకా వరి కుప్ప నూర్చాల్సి ఉంది. దిగుబడి ఆశాజనకంగా ఉండనుంది. ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. 4 ఏళ్లగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్నారు.

–ఊడి రాజు, రైతు, సుందరయ్యపేట.

దిగుబడి ఆశాజనకం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వరి పంటపై ఏడు గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించాం. దిగుబడి ఆశాజనకంగా ఉంది. 5 మీటర్ల పొడవు, వెడల్పులో పంట కోసి సేకరించిన ధాన్యాన్ని తూకం వేయగా సరాసరి 18 కిలోల వరకు దిగుబడి వచ్చింది.

–కూండ్రపు అరుణ, మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకురాలు, లాలం కొత్తూరు.

పర్యావరణ పరిరక్షణతోనే నాణ్యమైన నీరు లభ్యం



నీటి నాణ్యతను పరీక్షించే కిట్లను కళాశాల అధ్యాపకులకు అందజేస్తున్న ఫణిభూషణ్ శ్రీధర్, నూకరాజు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్యాన్ని అరికట్టి, నాణ్యమైన నీటిని పొందవచ్చని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రాష్ట్ర జీవవైవిధ్య సంరక్షణ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. స్థానిక గవరపాలెం నోబుల్ చారిటీస్ ఆధ్వర్యంలో 'వాటర్ అండ్ శానిటేషన్'పై బుధవారం జరిగిన ఒక రోజు వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పలు పరీక్షల ద్వారా నీటి నాణ్యతను నిర్ణయించవచ్చని చెప్పారు. నోబుల్ చారిటీస్ కార్యదర్శి శరగడం నూకరాజు మాట్లాడుతూ ఒక్కో ప్రదేశంలో రుతువులను బట్టీ నీటి నాణ్యత మారుతుందన్నారు. మట్టి, రాళ్ల వల్ల కూడా నాణ్యత మారుతుందని చెప్పారు. అనంతరం వివేకానంద డిగ్రీ కాలేజీ, విశ్వభారతి జూనియర్ కళాశాల విద్యార్థులకు నీటి నాణ్యతను పరీక్షించే కిట్లను ఉచితంగా కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చారిటీస్ అధ్యక్షురాలు శరగడం జయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు మళ్ల మురళీ, జి.నానాజీ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి



ఉడ్‌పేటలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న మందపాటి జానకీరామరాజు



వాజ్‌పేయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేటలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉడ్‌పేటలో సోషల్ వర్కర్ ఒమ్మి రాముయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్‌చేసి, నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు గంగుపాం నాగేశ్వరరావు, వివిధ పార్టీ నేతలు భర్నికాన నరసింహమూర్తి, బొడ్డేడ నాగేశ్వరరావు, కొండబాబు, గల్లా రాజేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, మావూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డులో..

స్థానిక రింగ్‌రోడ్డులో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొణతాల రాజాబాబు, కొణతాల అప్పలరాజు, కొండబాబు, ఉడా రమేష్, గేదెల స్వరూప్, మారిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ..కరుణల ప్రతీక క్రిస్మస్

ప్రేమ, కరుణలను పంచే పండగ క్రిస్మస్ అని, ఏసు ప్రభువు జన్మించిన శుభవార్తను ప్రపంచానికి చాటి చెప్పడమే ఈ పండగ పరమావధి అని పలువురు పాస్టర్లు తెలిపారు. జిల్లాలో వాడవాడలా క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును స్తుతిస్తూ యువతీయువకులు గీతాలు ఆలపించారు.



సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్



జమాదులపాలెంలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- ఘనంగా వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు శివసత్యనారాయణకు ప్రసాదం అందజేస్తున్న ఫాదర్ జాన్ కున్నవల్లి

అనకాపల్లి: పట్టణ, మండల పరిధి చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం రహదారిలో సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో రోమన్ కేథలిక్ సంఘం, ఇతర ప్రాంతాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్‌లు కట్ చేశారు. శాంతి, కరుణ, సహనం, ప్రేమ విలువలను ప్రపంచానికి చాటిన ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని చర్చిల ఫాదర్లు చెప్పారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.విజయ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మించిన రోజునే ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగ జరుపుకొంటున్నారని చెప్పారు.

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో రోమన్ కేథలిక్ సంఘం(చర్చి)లో క్రిస్మస్ వేడుకలను వైఎస్సార్‌సీపీ జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకం శెట్టి శివ సత్యనారాయణ(జోసెఫ్), ఫాదర్ జాన్ కున్నవల్లి ఘనంగా నిర్వహించారు.స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బి.చక్రవర్తి, కె.జోజి, ఆర్.రమణ, బి.లావణ్య, ఎ.ప్రసాద్, కె.ఏ సురత్నం, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులకు తువ్వాళ్ల పంపిణీ

స్థానిక వేల్పులవీధి సర్వకాంబ పార్కుసెంబర్ వద్ద నగిరి రామారావు ఆధ్వర్యంలో 200 మంది భవన నిర్మాణ కార్మికులకు తువ్వాలు పంపిణీ చేశారు. గాంధీనగరం బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు బిస్కెట్లు, శాంతాక్లజ్ టోపీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, వసతి గృహం అధికారి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గాన్ని అందరూ అనుసరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం రహదారి సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్‌లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్నిదేశాల్లో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జ్ కోరుకొండ రాఘవ, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, చర్చ్ ఫాదర్ సాక జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. స్థానిక సంతబయల ఉన్న ఆంధ్ర కల్వరీ సెంచునరీ బాప్టిస్టు చర్చిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. పాస్టర్ సన్ని జేమ్స్ ఏసు క్రీస్తు బోధనలు వినిపించారు. క్రీస్తును స్తుతిస్తూ యువతీయువకులు పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, చర్చి కమిటీ అధ్యక్షుడు టి.మోజెస్, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఏవైఎఫ్ బృందం తరఫున చర్చిలో పేదలకు, రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పాస్టర్ వై.సునీల్ బాబు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. పిల్లలు ఏసుక్రీస్తును కీర్తిస్తూ పాటలు పాడి ఆకట్టుకున్నారు. పాస్టర్ మూర్తి జేమ్స్, చర్చి ప్రతినిధులు కె.శ్యామల రాజు, కె.మదన్‌కుమార్, ఎస్.మధుసూదన్, కె.వరప్రసాద్, ఎస్. కృపావరం తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ కాలనీ వద్ద షాలెం మందిర్‌లో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు.

జమాదులపాలెంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మలసాల కిషోర్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండల సచి వాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. బయ్యవరం, తాళ్లపాలెం, తేగాడ, కొత్తపల్లి, పేరంటాలపాలెం, పరవాడపాలెం,తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, కన్నూ రుపాలెం, చెరకాం, తీడ, నూతలగుంటపాలెం, గొబ్బూరు, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, సోమవరం, ఎ.ఎస్.పేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



రోమన్ కేథలిక్ సంఘం(చర్చి)లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



రవీంద్రభారత్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



కశింకోటలోని గవరపేటలో ఏసుక్రీస్తు మందిరంలో క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడుతున్న బాలికలు



కశింకోట ఆంధ్ర కల్వరీ సెంచునరీ బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మలసాల భరత్‌కుమార్



వేల్పులవీధిలో భవన నిర్మాణ కార్మికులకు తువ్వాళ్లు పంపిణీ చేస్తున్న నగిరి రామారావు



ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు,పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న క్రైస్తవులు

యాచకులకు దుప్పట్ల పంపిణీ



యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిరంతర్ సేవ ఫౌండేషన్ సభ్యులు

తుమ్మపాల: నిరంతర్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచకులకు 225 దుప్పట్లు పంపిణీ చేసినట్టు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నల్లాల శ్రీనివాసరావు, డీసీఎంసీ సభ్యులు రేబాక మధు బాబు తెలిపారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా విశాఖపట్నం, గాజువాక ప్రాంతాలతో పాటు జిల్లాలో చోడవరం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి పట్టణ పరిసరప్రాంతాలలో రోడ్డు పక్కన చలిలో ఉంటున్న యాచకులకు వీటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కొమ్మోజు గణేష్, నారాయణ రావు, కలగా నూకేష్, త్రినాథ్, ఉదయ్, మణికంత, నాగ శ్రీను, దేవా, జె.తరుణ్, గొర్లి గణేష్ పాల్గొన్నారు.

కోడి పందాలాడుతున్న వ్యక్తి అరెస్టు

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలం కొత్తూరు వద్ద కోడి పందాలు ఆడుతుండగా ఆకస్మికంగా తమ సిబ్బందితో బుధవారం దాడి చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రెండు కోడి పుంజులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు. మిగిలిన వారు పరారైనట్టు సీఐ చెప్పారు.

నేడు విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సమావేశం

అనకాపల్లి: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా స్థానిక రింగ్‌రోడ్డు వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. కార్పొరేటర్లు, దేవస్థానం మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

వరి పనలు తడిస్తే.. ఉప్పు ద్రావణంతో రక్ష



వరి కుప్పలను పరిశీలిస్తున్న రంగాచారి

తుమ్మపాల: వర్షానికి వరి పనలు తడిస్తే పాడవకుండా రక్షించుకునేందుకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి సూచించారు. లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేస్తే ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటుందని చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిసినికాడ, తుమ్మపాల, దిబ్బపాలెం, బవులువాడ గ్రామాల్లో ఆయన బుధవారం క్షేత్ర సందర్శన చేసి, రైతులకు పలు సూచనలు చేశారు. వరి కోతలు చేసిన రైతులు పనులను కుప్పలుగా వేసుకోవాలన్నారు. కోతలు కోయని రైతులు రెండు రోజుల తర్వాత చేనుకోయాలని చెప్పారు. మండలంలో 2,509 హెక్టార్లకు గాను 1,640 హెక్టార్లలో వరి కోతలు పూర్తయినట్టు తెలిపారు. 281 హెక్టార్లలో వరి పనులపై ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ పనులపై ఉప్పు ద్రావణాన్ని జల్లితే ధాన్యం మొలకెత్తకుండా ఉంటాయన్నారు. 588 హెక్టార్లలో పంట కోయవలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు పార్వతి సాయి, గణేష్, ఆత్మ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.